ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 9 జనవరి 2025



పరికరాలు ఉన్నా.. లేనట్టే

ఆంధ్రజ్యోతి విజిట్



● ఈ వెంటిలేటర్లను చూశారా? ఒక్కోదాని ఖరీదు రూ.లక్షల్లో ఉంటుంది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో దీన్ని వినియోగించారంటే రోజుకు రూ.30 వేలు వరకూ వసూలు చేస్తారు. అటువంటి వెంటిలేటర్లు పలాస సామాజిక ఆసుపత్రిలో వృథాగా పడిఉన్నాయి. వీటిని ఎక్కడ పెట్టుకోవాలో తెలియక, సంబంధిత టెక్నీషియన్లు లేక ఓ గదిలో భద్రపరచాల్సి వచ్చింది.

● ఇదీ మెళియాపుట్టి మండలం కరజాడ ఆరోగ్య కేంద్రంలోని ఫీడర్ అంబులెన్సు. గత మూడు నెలల నుంచి మూలకు చేరినా పట్టించుకునే పరిస్థితి కనిపించటం లేదు. రహదారులు లేని గ్రామాలకు వెళ్లి రోగులను తీసుకువచ్చేందుకు గాను గత టీడీపీ ప్ర భుత్వం ఈ ఫీడర్ అంబులెన్స్‌ను ఇచ్చింది. ఇది మూలకు చేరడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు రక్తపరీక్షలకు సంబంధించిన సీబీసీ యంత్రం కూడా గత కొంతకాలంగా పని చేయడం లేదు. ఈ ఆరోగ్య కేంద్రంలో ఎఫ్ఎన్‌వో, స్వీపర్, వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- సౌకర్యాల్లేక మూలకు చేరిన వైనం
- కొన్నిచోట్ల మరమ్మతులు కరువు
- అత్యవసర సేవలకు అంతరాయం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు

జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో విలువైన వైద్య పరికరాలు వినియోగానికి నోచుకోవడం లేదు. వాటి ద్వారా రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. మౌలిక సౌకర్యాలూ అంతంతమాత్రమే. అవసరానికి సరిపడే గదులు లేక పరికరాలను మూలన పడేస్తున్నారు. ఆక్సిజన్ ప్లాంట్లు ఉన్నా.. ఉపయోగ పడడం లేదు. జిల్లాలోని వివిధ ఆస్పత్రుల పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా.. అనేక సమస్యలు బయట పడ్డాయి.

ఇప్పుడా చేసేది?

- సంక్రాంతి పండుగ సమయంలో చెట్ల తొలగింపుపై విమర్శలు
- ఏడురోడ్ల కూడలి నుంచి డేఅండ్ నైట్ వరకు రాకపోకలకు ఇక్కట్లు
- వ్యాపారులు, ప్రయాణికులు, వాహనచోదకుల ఇబ్బందులు
- దెబ్బతింటున్న వ్యాపారాలు



పాలకొండ రోడ్డుపై వదిలేసిన చెట్ల కొమ్మలు, మరోవైపు స్తంభించిన ట్రాఫిక్

శ్రీకాకుళం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సీజన్‌లో నగరం విపరీతమైన రద్దీగా ఉంటుంది. పండుగ సమీపించేసరికి రద్దీ మరింత పెరుగుతుంది. పండుగ సరుకులు, కొత్త దుస్తులు కొనుగోలు చేసేందుకు గ్రామాల నుంచి వస్తుంటారు. ఏ వ్యాపార దుకాణం చూసినా కిక్కిరిసి ఉంటుంది. ఇలాంటి సమయంలో నగర సుందరీకరణ పేరిట ఏడురోడ్ల కూడలి నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు పాలకొండ రోడ్డుపై డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. తొలగించిన వాటిని రోడ్డుపైనే పడేస్తుస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఒక్కోసారి ట్రాఫిక్ స్తంభించి పోతోంది. తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని దుకాణదారులు వాపోతున్నారు. సుందరీకరణకు ఇదా సమయం.. అంటూ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నగర సుందరీకరణ కోసమని..

శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డు వ్యాపార రంగానికి పెట్టింది పేరు. జీటీ రోడ్డు మొదలుకొని పాలకొండ రోడ్, డే అండ్ నైట్ కూడలి వరకు ఇరువైపులా వస్త్ర, బంగారు, కిరాణా, మొబైళ్ల, వంటి దుకాణాలతో పాటు పెద్దపెద్ద హోటళ్లు ఉన్నాయి. పండుగల సమయంలో ఈ ప్రాంతంలో వందల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంటుంది. అయితే, ఈ ఏడాది అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో రథసప్తమి వేడుకలు వైభవంగా జరపాలని ఆదేశించింది. దీంతో ప్రజాప్రతినిధుల సూచనల మేరకు నగర సుందరీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఏడురోడ్ల కూడలి నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం వేకువజామున 4 గంటల వరకు 361 చెట్లు తొలగించారు. అయితే డివైడర్లతో పాటు తొలగించిన చెట్లను కొన్నిచోట్ల రోడ్లపై వదిలేయడంతో బుధవారం వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఒక వైపే రాకపోకలు జరగడంతో ఏడురోడ్ల కూడలి నుంచి డేఅండ్ నైట్ జంక్షన్‌కు వెళ్లడానికి దాదాపు అరగంట సమయం పట్టింది. కొన్ని వాహనాలు ఏడురోడ్ల కూడలి నుంచి కాకుండా చిన్న బజార్ మీదుగా డేఅండ్‌నైట్‌కు చేరుకున్నాయి. పండగ సందర్భంగా వ్యాపారాలు మంగళవారం నుంచి ఊపందుకోవడం, అదే సమయంలో (మిగతా ఏడో పేజీలో)

జడ్పీ బడ్జెట్ ఆమోదం



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ విజయ

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్‌కు గత ఏడాది వచ్చిన ఆదాయం, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, చేపట్టిన వ్యయం పరిగణనలోకి తీసుకుని 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన బుధవారం బడ్జెట్ సమావేశం జరిగింది. జడ్పీ సహా పీఐయూ, పంచాయతీరాజ్, పీఆర్ఐ శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ డివిజన్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి 2025-26 సంవత్సరానికి గాను మొత్తం అంచనా బడ్జెట్‌లో రూ.1580.59 కోట్లు రాబడిగాను, రూ.1462.20 కోట్లు ఖర్చులుగా చూపించారు. రూ.118.38 కోట్లు మిగులు బడ్జెట్‌గా పొందుపరిచారు. అలాగే అన్ని పద్దుల కింద 2024-25 సంవత్సరానికి గాను సవరణ బడ్జెట్‌లో రాబడి రూ.1411.55 కోట్లు కాగా, ఖర్చు రూ.1306 కోట్లుగా చూపించారు. అంతిమంగా రూ.105.22కోట్ల నిల్వగా చూపించారు. సభ్యులంతా అంశాల వారీగా చర్చ నిర్వహించి బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, జడ్పీ ఉపాధ్యక్షురాలు పాలిన శ్రావణి, పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖలకు చెందిన ఇంజనీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రానికి

ఉత్తమ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న పరిశోధన కేంద్రం సంచాలకులు

శ్రీకాకుళం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రానికి (రాగోలు) 2023 సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయిలో ఉత్తమ పరిశోధన అవార్డు లభించింది. వరి, మినుము, పెసరలో బ్రీడర్ విత్తనోత్పత్తి, జన్యుస్వచ్ఛత కలిగిన వరి విత్తనోత్పత్తి సేవలకు గాను ఈ అవార్డు వచ్చింది. గుంటూరు లాఫారంలో బుధవారం వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్.శారదాజయలక్ష్మి నుంచి పరిశోధన కేంద్రం సంచాలకులు పీవీ సత్యనారాయణ, పి.ఉదయబాబు, కె.మధుకుమార్ ఈ అవార్డు అందుకున్నారు.

రైల్వేస్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దండి
● ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ మేనేజర్ హెచ్ఎస్ భజ్వా
6లో



పాందూరులో తగ్గుముఖం పట్టిన డయేరియా
7లో



క్షేత్రస్థాయి శిక్షణతో ప్రయోజనం
● డీవీఈవో తవిటినాయుడు
7లో



విశాఖ వచ్చిన ప్రధాని నరేంద్రమోదీకి నమస్కరిస్తున్న ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తో

సిక్కోలుకూ ప్రయోజనమే

- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవకాశం
- కొలువుల్లో దక్కనున్న ప్రాధాన్యం
- పరోక్షంగా ఇతర రంగాలకూ లబ్ధి
- జిల్లావాసుల్లో హర్షాతిరేకాలు

శ్రీకాకుళం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్ల నుంచో వేచి చూస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలసి బుధవారం శంకుస్థాపన చేశారు. దీంతో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను జిల్లాకు లబ్ధి చేకూరనుంది.



రిమోట్‌తో శంకుస్థాపన చేస్తున్న ప్రధాన మంత్రి మోదీ

ఉత్తరాంధ్రకు మేలు..

విశాఖకు రైల్వేజోన్ కేటాయించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలు తరచూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చేవారు. దీంతో ఎట్టకేలకు రైల్వేజోన్ కల సాకారమైంది. ప్రస్తుతానికి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయాన్ని రూ.149 కోట్లతో నిర్మించనున్నారు. దీనివల్ల ఉత్తరాంధ్రకు మేలు చేకూరనుంది. ఉత్తరాంధ్రలో భాగమైన శ్రీకాకుళం జిల్లాకు ప్రధాన కార్యాలయం అత్యంత చేరువగా ఉండటంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు వీలుంటుంది. జిల్లా ప్రజాప్రతినిధులు అక్కడకు వెళ్లి సమస్యలు పరిష్కారం చేసుకునేందుకు అవకాశముంది. అలాగే రైల్వే ప్రాజెక్టులే కాకుండా.. రైల్వే కొలువుల్లో ప్రాధాన్యం లభించనుంది. యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. ఒక్కోటిగా జిల్లాలో రైల్వే పనులను నిర్వహించుకునేందుకు వీలుంటుంది. కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టేందుకు, ప్రతిపాదనలు పెట్టి అవసరమైన నిధులను తీసుకువచ్చేందుకు వెసులుబాటు ఉంటుంది. దీంతో పాటు ప్రత్యక్షంగాను.. పరోక్షంగాను జిల్లాలో వ్యాపార, వ్యవసాయ రంగాల అభివృద్ధికి దోహదపడనుంది. దీంతో జిల్లావాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఎంతో ప్రయత్నించా.. పార్లమెంట్‌లో పదేళ్లు పోరాడా ..

విశాఖ రైల్వే జోన్ కోసం ఎంపీగా గత పదేళ్లు పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ.. పోరాడాను. ఎన్నోదఫాలు కేంద్రప్రజాప్రతినిధులకు వినతి ఇవ్వడమేకాకుండా ... రైల్వేజోన్ ఆవశ్యకత.. ఉత్తరాంధ్రకు ఏళ్లతరబడి జరుగుతున్న నష్టాన్ని వివరించాను. ఇప్పటికి ప్రధాన కార్యాలయం విశాఖపట్టణం వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా వచ్చి శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో పాటుగా నేను కేంద్రమంత్రిగా పాల్గొనడం.. ఉత్తరాంధ్రకు మేలు కలిగే 'విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం' నిర్మాణం కోసం పాలుపంచుకోవడం సంతోషంగా ఉంది. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం జిల్లాకు మరింత లబ్ధికలిగించేలా ముున్ముందు చర్యలుంటాయి. భారీ ప్రాజెక్టులు పూర్తిచేయడమే కాకుండా.. కొత్తవి కూడా మంజూరవుతాయి. ప్రధానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా:

-కె.రామ్మోహన్‌నాయుడు, కేంద్ర మంత్రి

పరికరాలు ఉన్నా.. లేనట్టే

ఆంధ్రజ్యోతి విజిట్

ఒక చోట పరికరాల కొరత. ఇంకోచోట పరికరాలు ఉన్నా... సదుపాయాల్లేక వినియోగానికి దూరం. మౌలిక సౌకర్యాలూ అంతంతమాత్రమే. అవసరానికి సరిపడే గదులు లేక పరికరాలను మూలన పడేస్తున్నారు. ఆక్సిజన్ ప్లాంట్లు ఉన్నా.. ఉపయోగ పడడం లేదు. ఇదీ జిల్లాలోని వివిధ ఆస్పత్రుల పరిస్థితి. ఈ ఆస్పత్రుల పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా.. అనేక సమస్యలు బయట పడ్డాయి.



వృథాగా పడి ఉన్న వెంటిలేటర్లు

- సౌకర్యాల్లేక మూలకు చేరిన వైనం
- కొన్నిచోట్ల మరమ్మతులు కరువు
- అత్యవసర సేవలకు అంతరాయం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు



పనిచేయని ఆక్సిజన్ ప్లాంట్

ఆక్సిజన్ ప్లాంట్ మూలకు..

నరసన్నపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అత్యసర సమయంలో రోగులకు అవసరమైన ఆక్సిజన్ లేక స్థానిక వంద పడకల ఆసుపత్రిలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొవిడ్ సమయంలో ఇక్కడ ఆక్సిజన్ ప్లాంటును ఏర్పాటు చేశారు. ప్రారంభించిన కొద్ది రోజులకే అది మూలకు చేరింది. ప్లాంట్‌లో కంప్లర్సర్స్ పని చేయకపోవడంతో పాటు, ప్లాంట్‌ను నిర్వహించేందుకు తగిన మానవ వనరులు లేకపోవడంతో మూలన మూలుగుతోంది. రక్తనిల్వలు చేసే ఫ్రిజ్ మూలకు చేరింది. 16 ఆక్సిజన్ యంత్రాలకు మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. ఆపరేషన్ థియేటర్‌లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్థో కేసులకు శస్త్రచికిత్స చేసేందుకు పరికరాలు లేవు.

మూడేళ్లుగా పనిచేయని ఆక్సిజన్ యూనిట్..



మూలకు చేరిన ఆక్సిజన్ యూనిట్

టెక్కలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో 500 ఎల్‌పీఎం గల ఆక్సిజన్ యూనిట్ మూడేళ్లుగా పనిచేయడం లేదు. కొవిడ్ సమయంలో అప్పటి కలెక్టర్ అత్యవసరంగా ఈ ఆసుపత్రికి పంపిన మరో ఆక్సిజన్ ప్లాంట్ కనీసం వినియోగంలోకి కూడా తీసుకురాకుండా ఆరుబయటనే వదిలేశారు. ఈ ఆసుపత్రిలో పీఎం కేర్ ఆక్సిజన్, ఎన్టీఆర్ ట్రస్ట్ ఆక్సిజన్ ప్రస్తుతం రోగులకు సేవలు అందిస్తున్నాయి. అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరం ఉన్నా... రేడియాలజిస్ట్ లేకపోవడతో ఆ సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక ఆసుపత్రిలోని వెయ్యి లీటర్ల ఆర్‌వో ప్లాంటుకు తరచూ మరమ్మతులకు గురవుతోంది. ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద అత్యవసర రోగులను తరలించే వీల్‌చైర్‌కు ఫుట్‌వేర్ వంటి సౌకర్యాలు లేక దయనీయమైన పరిస్థితిలో ఉంది.

ఇదేమి జనరేటరో...



పలాస, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పలాస సామాజిక ఆసుపత్రిలో రూ.30 లక్షలకు పైగా వెచ్చించి పెట్టిన భారీ జనరేటర్ ఇది. జనరేటర్ అన్నదాని కన్నా తెల్ల ఏనుగు అంటే సరిపోతుంది. గంటకు 25 లీటర్ల ఆయిల్ ఇట్టే తాగేస్తుంది. కేవలం అందులో డెడ్ స్టోరేజ్ 50 లీటర్ల ఆయిల్ ఉండాలి. తెచ్చిన నుంచి దీన్ని వినియోగించడం లేదు. ఆసుపత్రికి అయ్యే నెల ఖర్చు ఒక్క ఇంజిన్ నడిపించడానికే సరిపోతుంది. ఈ కారణంగా దీన్ని వినియోగించడం లేదు.

పనిచేయని ఎక్స్‌రే..



హరిపురం ఆసుపత్రిలో పనిచేయని ఎక్స్‌రే మిషన్

హరిపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురంలోని 30 పడకల ఆసుపత్రిలో ఉచిత డయాలసిస్ నిర్వహిస్తున్న మిషన్‌తో పాటు ల్యాబ్‌లో తాగునీటి ప్యూరిఫైర్, ఎక్స్‌రే మిషన్ పని చేయటం లేదు. దీంతో పూర్తిస్థాయిలో వైద్యం అందటం లేదు. రోజూ సుమారు 60నుంచి 100వరకు ఓపీ ఉంటోంది.

ఆక్సిజన్ ప్లాంట్ కనెక్షన్ ఏదీ?

పాతపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని 50 పడకల సామాజిక ఆసుపత్రిలో సౌకర్యాలు అంతంతమాత్రమే. కొవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ నుంచి అవసరమైన ప్రదేశాలకు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. నేటికీ కనెక్షన్ ఇవ్వని కారణంగా నిరుపయోగంగా మిగిలిపోయింది. ఆర్వో ప్లాంటు పూర్తయి ఏడాది దాటినా కాంట్రాక్టర్ అధికారులకు అప్పగించని కారణంగా నిరుపయోగంగా ఉంది.



పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

బేబీ వార్మర్ లేక అవస్థలు..

ఎచ్చెర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల పీహెచ్‌సీలో బేబీ వార్మర్ (ఇంక్యుబేషన్) లేక అవస్థలు ఎదురవుతున్నాయి. ఇటీవల కాలంలో పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెరుగుతున్నాయి. ఇక్కడి పీహెచ్‌సీలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 12 ప్రసవాలు జరిగాయి. అప్పుడే పుట్టిన బిడ్డకు బేబీ వార్మర్ అవసరం. తల్లి గర్భం నుంచి బయట పడిన వెంటనే శుభ్రం చేసిన బేబీని వార్మర్‌లో ఉంచాలి. ఈ పీహెచ్‌సీలో బేబీ వార్మర్ లేకపోవడం ఇబ్బందిగా ఉంది. బేబీ వార్మర్‌ను సరఫరా చేస్తే సౌలభ్యంగా ఉంటుందని వైద్య సిబ్బంది అభిప్రాయ పడుతున్నారు.

మూలకు చేరిన వార్మర్..



జలుమూరు ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న వార్మర్

జలుమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) స్థానిక పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేటపుడు పిల్లలకు వినియోగించే వార్మర్ వినియోగం లేక మూలకు చేరింది. ఆపరేషన్ థియేటర్‌లో గల ఆక్సిజన్ సిలిండరుదీ అదే పరిస్థితి. వార్మర్ ఆసుపత్రికి వచ్చి అయిదేళ్లవుతున్నా... ఒకసారి కూడా వినియోగించిన దాఖలాలు లేవు. ఈ ఆసుపత్రిలో ప్రసవాలు జరగక వాటికి ఉపయోగించే పరికరాలు వృథాగా పడి ఉన్నాయి. ఆరోగ్య పరీక్షలు నిర్వహించే ఎన్‌లైజరు, సెల్ కౌంటర్ కూడా వృథాగా పడి ఉన్నాయి. రెండేళ్ల క్రితం ఈ ఆసుపత్రిలో ఓపీ వంద వరకు ఉండేది. ప్రస్తుతం డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ఓపీ పదుల సంఖ్యకు పడిపోయింది.

వృథాగా వెంటిలేటర్లు..

సోంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పరికరాలు కొనుగోలు చేసింది. కానీ టెక్నీషియన్స్‌ను నియమించకపోవడంతో పరికరాలు వృథాగా ఉన్నాయి. సోంపేట సామాజిక ఆసుపత్రి కోసం కొవిడ్ సమయంలో ఆక్సిజన్, వెంటిలేటర్లను కొనుగోలు చేశారు. అవి ఇప్పటికీ వృథాగానే పడి ఉన్నాయి. ఆక్సిజన్ అందించే పైప్‌లైన్ ఏర్పాటు చేయకపోవడం, మత్తు డాక్టర్‌ను నియమించకపోవడంతో ఇవన్నీ వినియోగానికి దూరంగా ఉన్నాయి.

వైద్య పరికరాలు వినియోగానికి దూరం..

రణస్థలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కొండములగాం సీహెచ్‌సీ ఈ ప్రాంతానికి పెద్ద ఆసుపత్రి. జాతీయ రహదారిపై ఏ చిన్న ప్రమాదం సంభవించినా వెనువెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తారు. రోజుకు 200 వరకూ ఓపీ ఉంటుంది. ఇక్కడ భవనాల కొరత తీవ్రంగా వెంటాడుతోంది. రక్త నిల్వలకు సంబంధించిన పరికరం గత 9 నెలలుగా నిరుపయోగంగా ఉంది. దీని విలువ రూ.35 లక్షలు. దీనికి ప్రత్యేక ఏసీ గదులు అవసరం. రూ.6 లక్షల విలువ చేసే ఎక్స్‌రే పరికరం మూలకు చేరింది. వీటికి ప్రధానంగా భవనాల కొరత వెంటాడుతోంది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ఎక్స్‌రే అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించవలసి వస్తోంది. బ్లడ్ స్టోరేజ్ పరికరం అందుబాటులోకి వస్తే చాలా ఉపయోగం ఉంటుందని రోగులు అంటున్నారు.



కొండములగాం సీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న బ్లడ్ స్టోరేజ్, ఎక్స్‌రేల పరికరాలు

చెంచుల సందడి

నరసన్నపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో తమ సంస్కృతిని గ్రామాల్లో తెలుపుతూ చెంచులు చేస్తున్న నృత్యాలు.. ఆలపిస్తున్న గీతాలు అలరిస్తున్నాయి. బుధవారం నరసన్నపేట పట్టణంలో చెంచులు నృత్యాలు చేశారు. చెంచులక్ష్మి పాటలు పాడుతూ బలుసు ముళ్ల మీద నిల్చొని..చేసిన నృత్యాలు అలరించాయి. ఒంటి మీద వివిధ రకాల దుస్తులు.. తలపై నెమలి పించం... భుజం మీద అడవిపిల్లి చర్మం ధరించి.. చేతిలో పిల్లన గ్రోవితో గానం ఆకట్టుకున్నాయి. చెంచుల కుల పెద్ద ఆవల జగన్నాథం ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. వీరిది నరసన్నపేట మండలం గుండువిల్లిపేట.




పాటలు పాడుతున్న చెంచులు

నారాయణ తిరుమలలో సహస్ర దీపాలంకరణ సేవ



నారాయణ తిరుమలలో సహస్ర దీపాలంకరణ సేవ దృశ్యం



శివ బాలాజీ ఆలయంలో ఇలా..

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నారాయణ తిరుమలలో ధనుర్మాసం సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ చేశారు. పూలు, నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. అలాగే బ్యాంకర్స్ కాలనీలో ఉన్న శివ బాలాజీ ఆలయంలో జి.గోపి, నంబాల సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, సహస్ర దీపాలంకరణ సేవలు చేశారు. కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, చిన్న బజారులో ఉన్న దూదివారి కోవెల వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి తులసి మాలలతో అలంకరించారు. అదేవిధంగా అరసవల్లి దరిలో ఉన్న తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు..

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టర్ బంగ్లా దగ్గర కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తున్నారు. గోత్రనామాలతో పూజలు, అనంతరం శ్రీవారి దర్శనం, తిరుమల తిరుపతి దేవస్థానం వారు పంపిన కంకణాలు, పుస్తక ప్రసాదం, భక్తులకు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ లైట్లతో అలంకరించారు. బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయం, కోదండ రామాలయం, చిన్న బజార్ దూదివారి కోవెల, నానుబాల వారి వీధిలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



నారాయణ తిరుమలలో క్యూలైన్లు

రైల్వేస్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దండి



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం హెచ్ఎస్ భజ్వా

పలాస, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాలు, ఉద్యోగుల విశ్రాంతి గృహాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ రైల్వే మేనేజర్ హెచ్ఎస్ భజ్వా అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో పలాస రైల్వే స్టేషన్‌ను రైల్వే జనరల్ మేనేజర్, ఆయన బృందం సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో స్టేషన్‌ను ఆధునికీకరించాలని కోరారు. బుధవారం ప్రత్యేక రైలులో పలాస వచ్చిన ఆయన ముందుగా రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం టిక్కెట్ కార్యాలయం, గార్డులు, లోకోపైలెట్ల విశ్రాంతి గృహాలు, రైల్వే అతిథిగృహం, ఆర్పీఎఫ్ బ్యారక్స్, రైల్వే సిబ్బంది గృహాలను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. రైల్వే సిబ్బందికి సంబంధించి మంచినీటి సమస్యలు ఉన్నట్లు అధికారులు ఆయన దృష్టికి తీసుకురాగా తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. రైల్వే గృహాల్లో ఉద్యోగులు మాత్రమే నివాసం ఉండాలని, ఇతరులు ఉంటే తక్షణం పంపించాలని ఆదేశించారు. సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ జి.సునీల్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు, పలాస రైల్వే సిబ్బంది ఉన్నారు.

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్

బహిరంగ సభకు హాజరైన అశేష జనం



అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు

జి.సిగడాం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి, ఇతర పండగలు సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జేఆర్ పురం సీఐ ఎం.అవతారం హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం అక్రమ రవాణా, విక్రయాలు చేపట్టినా.. కోడి, పొట్టేళ్ల పందాలు, బెల్ట్ షాపులు, జూదం, అశ్లీల నృత్య ప్రదర్శనలు నిర్వహించకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈయన వెంట ఏఎస్ఐ కె.రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పశుగణన వేగవంతం చేయాలి


సూచనలిస్తున్న డీడీ రామ్మోహన్‌రావు

ఆమదాలవలస, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పశుగణన వేగవంతం చేయాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పాలేటి రామ్మోహన్‌రావు సూచించారు. బుధవారం గాజుల కొల్లివలస, ఆర్అండ్ఆర్ కాలనీ, చిట్టివలస, గుంట వానిపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న పశుగణన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వ హిస్తున్న విధానాన్ని ప్రజలకు, పాడి రైతులను అడిగి తెలుసుకున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి స్టిక్కర్‌ను అంటించాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు కల్యాణి, నవీన్ తదితరులు ఉన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

ఆమదాలవలస, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన వారి కుటుంబాలను బుధవారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. పొందూరు వైస్ ఎంపీపీ భర్త కాకర్ల రాజారావు ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబాన్ని, శ్రీకాకుళం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన గావిడి వాసుదేవరావు కుమారుడు ఇటీవల భోగాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆ కుటుంబాలను పరామర్శించారు. బెండిపేటకు చెందిన ఎన్ని ధనుంజయరావు సోదరుడు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వైసీపీ నాయకులు ఉన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ

పొందూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో సిబ్బంది నిర్లక్ష్యంపై బుధవారం డీసీహెచ్ కల్యాణ్‌బాబు విచారణ చేపట్టారు. ఆదివారం ఆసుపత్రికి చికిత్సకు వచ్చిన తనను కనీసం లోపలకు రానీయకుండానే, సిబ్బంది లేరంటూ పంపించేశారని తుంగపేట గ్రామానికి చెందిన పైడి వైకుంఠరావు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో డీసీహెచ్ కల్యాణ్‌బాబు విచారణ జరిపారు. కీలకమైన ఆసుపత్రిలో ఆదివారం లాబ్ టెక్నీషియం లేకపోవడంపై ఫిర్యాదుదారుడు డీసీహెచ్ ముందు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం లాబ్‌సిబ్బంది లేకపోయినా అవసరమైన వైద్య సేవలు అందించాలని సూపరింటెండెంట్ సుజాత ఆదేశించారు.

డీఆర్ఎం దృష్టికి రైల్వే సమస్యలు


వినతి పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం, కంచిలి రైల్వే స్టేషన్‌లో గల పలు సమస్యలను జడ్ఆర్‌యూసీసీ మెంబర్ శ్రీనివాస్ రంగా రౌలో డీఆర్ఎం హర్భజన్ సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు బుధవారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో డీఆర్ ఎంకు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో నిర్మాణ దశలో ఉన్న బిల్డింగ్స్, టికెట్ కౌం టర్ గూర్బి, రత్తకన్న గేట్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టా లని, సోంపేట రైల్వే స్టేషన్ షిఫ్ట్ రిజర్వేషన్ కౌంటర్ ఓపెన్ చేయాలని, జాడుపూడి రైల్వే స్టేషన్‌లో బ్రహ్మ పూర్-వైజాగ్ ఇంటర్‌సిటీ హాల్టింగ్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం ఏఈఎన్, రైల్వే ఇంజనీర్లు పాల్గొన్నారు.

అలరించిన ఏకపాత్రాభినయం


బహుమతి అందుకుంటున్న ఉపాధ్యాయుడు శంకరరావు

నందిగాం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి స్వర్ణో త్సవాల్లో సం ఘం జిల్లా కార్యదర్శి, పెద్దతామరాపల్లి ఉపాధ్యాయుడు బాలక శంకరరావు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ ఏకపాత్రాభినయం పోటీలో పాల్గొని ప్రశంసలు అందుకు న్నారు. ఈ సందర్భంగా అల్లూరి పాత్రకు వచ్చిన బహుమతిని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అందించారు

శ్రీరాములునాయుడి జీవితం స్ఫూర్తిదాయకం


పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘ నేతలు

శ్రీకాకుళం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయతీకి మారుపేరుగా నిలిచిన దివంగత మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తారని తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. శ్రీరాములు నాయుడి వర్ధంతి సందర్భంగా బుధవారం కిమ్స్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు ఎస్.చిరంజీవి, కృష్ణచంద్, మామిడి విష్ణు, ఎస్.రవికుమార్, సురేష్ కుమార్, కీర్తి, సుశీల, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● రణస్థలం జనవరి 8(ఆంధ్రజ్యోతి): దివంగత నేత, మాజీ మంత్రి గొర్లె శ్రీరాములనాయుడు నేటి తరానికి ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిస్నింటి సాయికుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చి(చె)త్త శుద్ధి ఏదీ?

గార, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సముద్రతీర గ్రామం బందరువానిపేట రోడ్డు పక్క చెత్త నిల్వలు పేరుకుపోయాయి. గ్రామం పెద్దది కావడంతో పాటు వీధులు దగ్గరగా ఉండటంతో ఇళ్లలోని చెత్తను రోడ్డు పక్కన పారబోస్తున్నారు. ఫలితంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని, తక్షణమే చెత్త నిల్వలు తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బందరువానిపేటలో రోడ్డు పక్క పేరుకుపోయిన చెత్త

తగ్గుముఖం పట్టిన డయేరియా

పొందూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కస్పావీధిలో మూడురోజుల కిందట ప్రబలిన డయేరియా తగ్గుముఖం పట్టింది. పంచాయతీ అధికారులు యుద్ధప్రాతిపదికన చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలు, సురక్షితమైన తాగునీటి సరఫరాతోపాటు ఇంటింటికి వెళ్లి వైద్యులు అందిస్తున్న చికిత్సలతో వ్యాధి అదుపులోకి వచ్చింది. బుధవారం కేవలం ఇద్దరు మాత్రమే డయేరియాతో స్థానిక ఆసుపత్రిలో చేరారు. వీరికూడా ముందురోజు చికిత్స తీసుకుని మెరుగైన చికిత్సకోసం ఆసుపత్రిలో చేరారు. కాగా పొందూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులను శ్రీకాకుళం డీసీహెచ్ ఎస్.కల్యాణ్‌బాబు పరామర్శించి వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. డీసీహెచ్‌తోపాటు ఎపిడమాలజిస్ట్ సుజాత, సూపరింటెండెంట్ పి.సుజాత, వైద్యులు రమేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

చెరువులో పారిశుధ్య పనులు

డయేరియా వ్యాధి ప్రబలడానికి కారణమైన పెద్ద చెరువు పరిసరాల్లో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ చెరువులో కలుషితమైన చేపలు తినడం ద్వారానే కస్పావీధిలో పదుల సంఖ్యలో డయేరియా బారినపడ్డారు. చెరువు పరిసరాల్లో బుధవారం మరోసారి నిర్వహించిన పారిశుధ్య పనులను డీఎల్‌పీవో ఐవీ రమణ పరిశీలించారు.


ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న డీసీహెచ్ కల్యాణ్‌బాబు

క్షేత్రస్థాయి శిక్షణతో ప్రయోజనం

● డీవీఈవో తవిటినాయుడు

గుజరాతీపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు క్షేత్రస్థాయి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఇంటర్మీడియట్ విద్య, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి శివ్వాల తవిటినాయుడు అన్నారు. వృత్తి విద్య కోర్సుల అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఏటా ఆన్ ద జాబ్ ట్రైనింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ విద్యార్థులకు సింగుపురం జంక్షన్ వద్ద గల అక్షయపాత్ర ఫౌండేషన్‌లో నిర్వహిస్తున్న ఒక రోజు ద జాబ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన సరఫరా చేస్తోన్న అక్షయపాత్ర ఫౌండేషన్ కార్యాలయంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సరుకుల సరఫరా, వివిధ రకాల ఆహార వంటల తయారీ విధానం, పంపిణీ, అకౌంటింగ్ పుస్తకాల నిర్వహణ తదితర అంశాలపై సంస్థ మేనేజర్ వెంకటరాజు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఏజీఎంవో, లైబ్రేరియన్ తాతారావు, అక్షయపాత్ర సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీవీఈవో

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా కిశోర్‌కుమార్



గుజరాతీపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కాకినాడలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో భాగంగా నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.కిశోర్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. విద్యారంగంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో గత 20 ఏళ్లుగా కీలకంగా వ్యవహరించారు. కిశోర్ ఎంపికపై ఉపాధ్యాయులు, ఉద్యోగులు అభినందించారు.

మూలపేట పోర్టు పరిశీలన


పోర్టు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న పరిశ్రమల శాఖ కార్యదర్శి

సంతబొమ్మాళి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులను రాష్ట్ర పరిశ్రమల కార్యదర్శి యువరాజ్ బుధవారం పరిశీలించారు. పోర్టు అవసరాలకు ఇంకా భూములు అవసరం ఉన్నందున ఏపీఐఐసీకి చెందిన భూములను పరిశీలించారు. పోర్టు నిర్మిస్తున్న పరిసర ప్రాంతాల్లో అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు అవకాశాలను నిశితంగా పరిశీలించారు. పోర్టు నిర్మా ణ పురోగతిని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టెక్కలి ఆర్డీవో కృష్ణ మూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి


బైక్ ర్యాలీ చేస్తున్న సంఘాల నేతలు

మెళియాపుట్టి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిల భారత రైతుకూలీ సంఘం, సీపీఐఎంఎల్ (న్యూ డెమోక్రసీ) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ ఐటీడీఏ వచ్చే వరకు పోరాటం చేద్దామన్నారు. ఈనెల 11 న మెళియాపుట్టిలో మహాధర్నా నిర్వహించనున్నామని, దీనిలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్ర మంలో అంపురం, ముకుందపురం సర్పంచ్‌లు జయ్యమ్మ, నేతలు భాస్కరరావు, శంకరరావు, నూకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు


అపరాధ రుసుం విధిస్తున్న హెల్త్ అధికారి సుధీర్‌కుమార్

శ్రీకాకుళం, అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తప్ప వని మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ సుధీర్‌కు మార్ వ్యాపారులను హెచ్చరించారు. బుధవారం స్థానిక పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌లో ఆయన పలు దుకాణాలను తనిఖీ చేసి నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని, రూ.14వేల అపరాధ రుసుం విధించారు.

టాలెంట్ టెస్ట్‌కు స్పందన

సోంపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బారువ పూర్వవిద్యార్థుల సంఘం వార్షికోత్సవం సందర్భంగా ఉపాధ్యాయవేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు మంచి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. 198 బృందాలు పాల్గొనగా మొదటి బహుమతి మంచినీళ్లపేట విద్యార్థులు గెలుచుకోగా, పలాస మండలం మామిడిపల్లి విద్యార్థులు రెండో స్థానం, మందస మండలం కొత్తూరు విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు.

అండర్-12 క్రికెట్ జిల్లా జట్టుకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

ఇచ్ఛాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అండర్-12 జిల్లా క్రికెట్ జట్టుకు ఇచ్ఛాపురం ఐసీసీ క్రికెట్ క్లబ్‌కు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్టు ఐసీసీ కోచ్ గోపి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 9 నుంచి విజయనగరంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-12 క్రికెట్ టోర్నీలో సాలిన సాయి డిషోజ్ యాదవ్, సమీత్‌గౌడ్, ఏవీ దక్ష్, ఓం ప్రకాష్ జిల్లా తరఫున ఆడనున్నారు.

పాఠశాలలను సమర్థంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న శశిభూషణరావు

ఎచ్చెర్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పాఠశాలల నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉండాలని సర్వశిక్ష ఏపీసీ శశిభూషణ్ అన్నారు. శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో ఎంఈవోలకు, ఉన్నత పాఠశాల హెచ్ఎంలకు వారం రోజుల పాటు నిర్వహిస్తున్న స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్ఎల్‌డీపీ) ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. కోర్సు కోఆర్డినేటర్ బి.గోవిందరావు, క్యాంప్ ఇన్‌చార్జి జి.రాజ్‌కిశోర్, రాష్ట్ర పరిశీలకుడు అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి మార్గం అనుసరణీయం


వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వివేకానందుని మార్గం భవితకు సోపానమని ఉపనిషన్మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్ అన్నారు. శారద రామకృష్ణ సేవా సమితి, ఉపనిషన్మందిరం సంయుక్తంగా వివేకానంద జయంతిని బుధవారం నిర్వహించారు. వివేకానందుడు యువతకి మార్గదర్శి అని, తన ప్రసంగాలతోనే చైతన్యం తెచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో యువజన ఉత్సవాల కన్వీనర్ మందపల్లి రామకృష్ణ, జంధ్యాల శరత్‌బాబు, పతంజలి శాస్త్రి తదితరులు వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదేవిధంగా స్వామి కంచి పరమాచార్య జయంతిని నిర్వహించారు.

గ్రిగ్స్ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

రణస్థలం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్లో గత రెండు రోజులుగా జరిగిన ఎచ్చెర్ల నియోజకవర్గం గ్రిగ్స్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ క్రీడా పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారు. ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన దున్న సుచరిత షార్ట్‌పుట్‌లో ప్రథమస్థానం సాధించగా డిస్కస్‌త్రోలో కోమలి ప్రథమ, సుచరిత ద్వితీయ స్థానాలు సాధించారు. 100 మీటర్ల పరుగు పందెంలో జస్వంత్ తృతీయ, 400 మీటర్ల పరుగు పందెంలో రమణ తృతీయ స్థానం సాధించారు. రణస్థలం జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న కె.జస్వంత్ హైజంప్, లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానం సాధించాడు. సీనియర్స్ విభాగం హైజంప్‌లో ఎం.జితన్, జావిలిన్‌త్రో జితిన్ ప్రథమస్థానం, షార్ట్ పుట్‌లో సాయిలత మూడో స్థానం, బ్యాడ్మింటన్‌లో ప్రథమస్థానం స్వారూప, రోహిత్ సాధించారు.

ఇప్పుడా చేసేది?

(ఐదో పేజీ తరువాయి)

ఈ చెట్లు తొలగించి రోడ్లపై పడేయడం, ప్రజల రాకపోకలు నిలిచిపోవడంతో తమ వ్యాపారాలు దెబ్బతిన్నాయంటూ దుకాణదారులు గగ్గోలు పెడుతున్నారు.

మా వ్యాపారం దెబ్బతింటుంది

మొక్కలు తొలగించడం కోసం రెండు రోజులుగా పాలకొండ రోడ్‌లో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధుల అనాలోచిత నిర్ణయంతో మా వ్యాపారం దెబ్బతింది. రథసప్తమికి ఇంకా సమయం ఉంది. మరో మూడు రోజుల్లో సంక్రాంతి పండుగ ఉండగా వ్యాపారాలకు ఇబ్బంది పెట్టేలా చెట్ల తొలగింపు చర్యలు చేపట్టడం దారుణం.

- ఓ వస్త్ర వ్యాపారి, పాలకొండ రోడ్

నగరసుందరీకరణలో భాగంగానే..

రథసప్తమిని మూడు రోజుల పాటు రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నాం. దీనికోసం నగర సుందరీకరణలో భాగంగా చెట్లు తొలగించాం. చెట్లు బలంగా నాటుకుపోవడంతో తొలగించడానికి సమయం పట్టింది. యుద్ధప్రాతిపదికన తొలగించి రోడ్డు క్లియరెన్స్ చేస్తున్నాం. గురువారం ఉదయం నాటికి పూర్తిగా చెట్లను తరలిస్తాం.

- పీవీవీ ప్రసాదరావు, నగరపాలక కమిషనర్

టిక్కెట్ సర్వీస్ పోయింది

శ్రీకూర్మం నుంచి డేఅండ్ నైట్ వరకు సర్వీస్ చేస్తుంటా. రెండు రోజులుగా చెట్లు కొడుతుండడంతో సూర్యమహల్ మీదుగా రామలక్ష్మణ కూడలి, ఇలిసిపురం మీదుగా డేఅండ్ నైట్ వెళ్తున్నా. దీంతో ఇబ్బందిగా ఉంది. టిక్కెట్ చార్జీ కంటే డీజిల్ ఖర్చు ఎక్కువ అవుతుంది. పండుగ సమయంలో ఇటువంటి చర్యలు సరికావు.

- కాంతారావు ఆటో డ్రైవర్ (శ్రీకూర్మం)

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

గార, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కె.మత్స్యలేశం, కోకావారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జి.రాము, టి.సహస్ర, జె.తనుశ్రీ, డి.లక్ష్మి నియోజకవర్గస్థాయి గ్రిగ్స్ పోటీల్లో విజేతలుగా నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం జి.ప్రకాశరావు, వ్యాయామోపాధ్యాయురాలు అరుణ తెలిపారు. వీరి ఎంపిక పట్ల ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

కూర్మనాథ క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి పూజలు

గార, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మం దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో గురునాథరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు స్వామివారి తిరువీధి మహోత్సవం, అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

పౌష్టికాహారం అందించాలి

ఇచ్ఛాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందివ్వాలని సీడీపీ నాగరాణి అన్నారు. బుధవారం 9వ వార్డు పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది రమణమ్మ, స్వాతి పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు

నరసన్నపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అభాగ్యులు అధైర్య పడవద్దని, కూటమి ప్రభుత్వంలో అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో పనిచేస్తున్న కేవీఎన్ శాంతిమూర్తి ఎముకల వ్యాధితో బాధపడుతుండగా శస్త్రచికిత్స నిమిత్తం రూ.1.50 లక్షలు, పప్పుల వీధికి చెందిన తంగుడు ప్రమీలకు రూ.81 వేలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు కాగా ఆ చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

సోంపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రపై ఆటోడ్రైవర్లకు పోలీసులు బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లవరాజు మాట్లాడుతూ.. రహదారిలో ప్రయాణించేటప్పుడు ఆటో డ్రైవర్లు జాగ్రత్త వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రమాదకరం

పూండి గల్లి సమీపంలో ఆర్ అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన రంధ్రం ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ మార్గంలో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఈ రంధ్రం వల్ల పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

-వజ్రపుకొత్తూరు (ఆంధ్రజ్యోతి)



పూండిగల్లి వద్ద రోడ్డుపై ఏర్పడిన రంధ్రం

అసంపూర్తి



బిత్తరబంద రోడ్డులో కల్వర్టు నిర్మించాల్సిన ప్రాంతం

మందస మండలం సాబకోట పంచాయతీ బిత్తరబంద గిరిజన గ్రామ రహదారి ఇది. గత ఏడాది ఐటీడీఏ ఆధ్వర్యంలో సుమారు రూ.8 లక్షల ఉపాధి నిధులతో నిర్మించారు. అయితే గ్రామానికి సమీపంలో కొండనీరు వచ్చే ప్రాంతంలో కల్వర్టు నిర్మించాల్సి ఉన్నా.. ఆ ప్రాంతం విడిచిపెట్టి మిగిలిన ప్రాంతంలో రోడ్డు నిర్మించారు. దీంతో ఇటుగా ప్రయాణం సాగించే వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే మా పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇలా అసంపూర్తిగా విడిచిపెట్టడం వల్ల ప్రయోజనం లేదని, తక్షణం సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-హరిపురం (ఆంధ్రజ్యోతి)

ఆవేదన

లక్ష్మీనర్సుపేట జంక్షన్‌లో అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుపై కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ మార్గంలో వెళ్లే వాహనాలను గుంపులుగా ఒకేసారి వెంబడించడం, బాటసారులపై దాడిచేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే నిత్యం ప్రజలు ఈ దారిలో నడుచుకుంటూ వెళుతుంటారు. ఇప్పటికైనా కుక్కలను నియంత్రించి ప్రమాదాలను అరికట్టాలని పలువురు వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

-ఎల్ఎన్‌పేట (ఆంధ్రజ్యోతి)



ఎల్ఎన్‌పేటలో గుంపుగా కుక్కలు

నిర్లక్ష్యం



తాళభద్ర నుంచి నర్సిపురం వెళ్లేందుకు ఉన్న కచ్చా రోడ్డు

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 5, 8 వార్డులను కలిపే నర్సిపురం- తాళభద్ర రోడ్డు ఎన్నో ఏళ్లుగా కచ్చా రోడ్డుగానే ఉంది. తాళభద్ర ఎల్‌సీ గేటు నుంచి కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉండే ఈ మార్గంలో ఇప్పటికే కిలోమీటరుకు పైగా సీసీ రోడ్డు నిర్మించారు. మిగిలిన భాగం సీసీ రోడ్డు వేయకపోవడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు పూర్తయితే ఎటువంటి ఇబ్బందులు లేకుండా నర్సిపురం మీదుగా పాత హైవేకి చేరుకోవచ్చు. గతంలో ఈ రోడ్డుకు ప్రతి పాదనలు వెళ్లినా రైల్వే శాఖ ఆధీనంలో ఈ భూ భాగం ఉన్నందున పక్కా రోడ్డు వేయలేక పోయినట్లు అధికారులు చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా రెండు శాఖలు సమన్వయంతో రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

-పలాస (ఆంధ్రజ్యోతి)

క్రైం కార్నర్

పాడేరులో రోడ్డు ప్రమాదం

● పొందూరు వాసి మృతి



వెంకటరమణ(ఫైల్)

పొందూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొందూరు నాయుడు వీధికి చెందిన నల్లి వెంకటరమణ (49) మృతి చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. ఉద్యోగ రీత్యా విజయనగరంలో నివాసం ఉంటున్న వెంకటరమణ పాడేరులో ఏపీఎస్‌టీ హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం విధులు ముగించుకుని బైక్‌పై విజయనగరం వస్తుండగా.. పాడేరులోనే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో వెంకటరమణ బైక్‌తో పాటు కొద్ది దూరం ఎగిరిపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే తోటి ఉద్యోగులు, స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అందరితో మంచిగా ఉండే వెంకట రమణ మృతిచెందడంతో పొందూరు పట్టణం నాయుడు వీధిలో విషాదఛాయలు అలముకున్నాయి. వెంకట రమణకు భార్య పద్మ, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం పొందూరుకు తీసుకు వచ్చారు.

నేలబావిలో పడిన వ్యక్తి

● కాపాడిన ఫైర్ సిబ్బంది

సోంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నౌహరి ప్రతాప్(45) బావిలో బుధవారం జారిపడి పోయాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని బావిలో ఉన్న ప్రతాప్‌ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఫైర్ ఎస్ఎఫ్‌వో ఎస్.మోహనరావు, సిబ్బంది రమేష్‌నాయుడు, కె.భాస్కరరావు, ఆర్.సింహాచలం పాల్గొన్నారు.



ప్రతాప్‌కు సపర్యలు చేస్తున్న దృశ్యం

435 మద్యం సీసాల స్వాధీనం

జి.సిగడాం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నడిమివలస కూడలి వద్ద వాహనాల తనిఖీల్లో 435 మద్యం సీసాలను ఏఎస్ఐ కె.రామకృష్ణ, సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్టు జేఆర్ పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో దీనికి సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. బాతువ గ్రామానికి చెందిన కలిశెట్టి పైడిరాజు ద్విచక్ర వాహనంపై మూడు సంచుల్లో మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా.. పట్టుబడినట్టు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.56,926 ఉంటుందన్నారు. పైడిరాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఎక్కువ మొత్తంలో మద్యం సీసాల స్వాధీనం చేసుకున్న ఏఎస్ఐ రామకృష్ణ, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

గుండెపోటుతో కాంట్రాక్ట్ అధ్యాపకుడి మృతి



బాబూరావు (ఫైల్)

పాతపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న హిస్టరీ లెక్చరర్ గుంపాన బాబూరావు (56) గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం విధులకు హాజరైన బాబూరావు నీరసంగా ఉందంటూ కూర్చోవడంతో సహ సిబ్బంది వెంటనే స్థానిక 50 పడకల సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. స్థానిక పెద్ద దేవాంగులవీధిలో ఆయన కుటుంబంతో కలిసి ఉంటున్నారు. బాబూ రావు స్వగ్రామం అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం సిరిజం. ఈయన మొదటి భార్య 15 ఏళ్ల కిందట మృతి చెందారు. ఇద్దరు కుమారులున్నారు. రెండో భార్యకు పిల్లలు లేరు.

విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాలు

జలుమూరు (సారవకోట), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా ప్రతి ఏటా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని ఆ సంఘం బుడితి శాఖ అధ్యక్షుడు నిక్కు హరిసత్యనారాయణ అన్నారు. బుడితి గ్రామంలో బుధవారం విజయనగరానికి చెందిన ఓ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయసు పైబడి ఆరోగ్య సమస్యలతో దూర ప్రాంతాలకు వెళ్లలేని వారి కోసం స్థానికంగా నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకో వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం బుడితి శాఖ ప్రధాన కార్యదర్శి ఆనెం చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వాన కనకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సోమేశ్వర పాడి పాల్గొన్నారు.

గ్రిగ్స్ క్రీడా పోటీ విజేతలకు అభినందన

పోలాకి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గస్థాయి బాల, బాలికల గ్రిగ్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థులను బుధవారం ప్రిన్సిపాల్ పి.ప్రవీణ, పీడీ ఎం.నీలం అభినందించారు. పి.తేజశ్వని, ఎం.తనుశ్రీ, జె.శరణ్య, ఎం.దినేష్‌కుమార్, కె.భరత్‌కుమార్, పి.ఝాన్సీ సబ్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

ప్రధాని మోదీ సభకు తరలిన కూటమి నాయకులు

నరసన్నపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు బుధవారం జిల్లా నలుమూలల నుంచి కూటమి నాయకులు, కార్య కర్తలు, ప్రజలు తరలి వెళ్లారు. అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులను వేయ డంతో ప్రజలు పెద్ద ఎత్తున వెళ్లారు. మడపాం టోల్‌ప్లాజా వద్ద నరసన్న పేట నియోజక వర్గం నుంచి బయలుదేరిన బస్సులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల కూటమి నాయకులు ధర్మాన తేజ్‌కుమార్, బైరి భాస్కరరావు, మిరియపల్లి వెంకటప్పలనాయుడు, శిమ్మ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రధాని మోదీని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కలిసి అభివాదం చేశారు.



నరసన్నపేట: బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పాతపట్నం నుంచి..

పాతపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ప్రధాని మోదీ సభకు పాతపట్నం నియోజకవర్గం నుంచి కూటమి నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నేతృత్వంలో ఐదు మండలాల నుంచి 10 బస్సులు, 135 కార్లతో వందలాది మంది నేతలు, కార్యకర్తలు, ప్రజలు బయలుదేరి వెళ్లారు.

శ్రీకాకుళం నుంచి..

అరసవల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విశాఖలో బుధవారం జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి 87 ఆర్టీసీ బస్సుల్లో సుమారు 5000 మంది తరలివెళ్లారు. కిష్టప్పేటలో ఎమ్మెల్యే గొండు శంకర్ జెండా ఊపి ప్రారంభించారు.



పాతపట్నం: కార్లతో వెళుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

జిల్లా నుంచి 232 బస్సులు

జిల్లా వ్యాప్తంగా గల శ్రీకాకుళం-1, 2, టెక్కలి, పలాస ఆర్టీసీ డిపోల నుంచి 232 బస్సులను వినియోగించారు. శ్రీకాకుళం డిపో-1 నుంచి 70, డిపో-2 నుంచి 69, టెక్కలి డిపో నుంచి 45, పలాస డిపో నుంచి 48 బస్సులను ప్రజల తరలింపునకు వినియోగించారు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ప్రధానికి స్వాగతం పలికిన విప్ అశోక్

సోంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు అరుదైన అవకాశం దక్కింది. విశాఖ పర్యటనకు బుధవారం విచ్చేసిన ప్రధాని మోదీకి స్వాగతం పలి కిన వారి జాబితాలో అశోక్ ఉన్నారు. విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రధానికి స్వాగతం పలికారు.



అరసవల్లి: బస్సుకు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

హెచ్ఎంపీవీ కేసులపై మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

టెక్కలి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దేశంలో అక్కడక్కడా హెచ్‌ఎంపీవీ కేసులు విస్తరిస్తున్న నేప థ్యంలో స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఈ వైరస్‌కు సంబంధించి ఏర్పాటుచేసిన ఐసోలేషన్ వార్డులో బుధవారం వైద్యులు, సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. హెచ్‌ఎంపీవీ వైరస్ సోకిన వ్యక్తి ఆసుపత్రికి చేరితే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యసేవలు ఏవిధంగా అందించాలనే విషయాల్లో 108 సిబ్బందితో కలిసి మాక్‌డ్రిల్ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ నీలవేణి, హెడ్‌నర్స్ అరుంధతి, భారతి, నిర్మల, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రశంసలు

సంతబొమ్మాళి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో సంతబొమ్మాళి ఎంజేపీ బీసీడబ్ల్యూసీ పాఠశాల విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. తాగునీరు లభించక ఇబ్బంది పడుతున్న తరుణంలో ప్రొటోటైప్ మోడల్ విధానంలో వర్షపు నీటిని నిల్వ చేసి దానిని సద్వినియోగం చేసుకొనేలా విద్యార్థులు అంపోలు దీపక్, అంజంగి శివహరీష్ రూపొందించిన 'సస్టైనబుల్ వాటర్ మేనేజ్‌మెంట్'పై రూపొందించిన ప్రాజెక్టు ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. విద్యార్థులను నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందించారు. విద్యార్థులను, గైడ్ టీచర్ అరంగి సుధను ప్రిన్సిపాల్ ఎం.కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.



విజయవాడలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

'ఉపాధి' పనుల్లో మేట్‌లే కీలకం

నరసన్నపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో వేతనదారులు మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని, మేట్‌లు కీలకంగా వ్యవహరించాలని సోషల్ ఆడిట్ డీఆర్పీ సురేష్ అన్నారు. బుధవారం జమ్ము సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. రైతులకు ఉపయోగపడేలా పనులను గుర్తించి గ్రామసభ తీర్మానంతో చేపట్టాలన్నారు. సాగునీటి కాలువలు, పిల్ల కాలువలు, పొలాల్లో ఎత్తుపల్లాల తొలగింపు తదితర పనులు చేపట్టాలన్నారు. ఉపాధి పనులపై ఈ ఏడాది నుంచి నిరంతర నిఘా ఉంటుందన్నారు. సర్పంచ్ వాన గోవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూటమి నాయకులు రెడ్డి సతీష్, దుంగ సింహాచలం, సచివాలయ, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

రంగవల్లికలు మన సంస్కృతికి ప్రతీకలు

నరసన్నపేట/టెక్కలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా నరసన్నపేట, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బుధవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు డా.పి.లత, డా.టి.గోవిందమ్మ మాట్లాడుతూ.. రంగవల్లికలు మన సంస్కృతికి ప్రతీకలని అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపాల్ శాంతిహేమ, అధ్యాపకులు పాల్గొన్నారు.



టెక్కలి: రంగవల్లికలను తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు



నరసన్నపేట: ప్రథమ బహుమతి పొందిన ముగ్గును పరిశీలిస్తున్న అధ్యాపకులు

పీఏసీఎస్ సిబ్బంది పెన్‌డౌన్

కోటబొమ్మాళి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హెచ్ఆర్ పాలసీని అమలు చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఇవ్వకపోవడం, పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడంతో పీఏసీఎస్ సిబ్బంది బుధవారం పెన్‌డౌన్ చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం 62 సంవత్సరాలకు పదవీ విరమణ వయసు పెంచినా పీఏసీఎస్‌లకు అమలు చేయలేదని, ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.2 లక్షలు తప్ప ఇతర ప్రతిఫలాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో మెండ సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న సిబ్బంది

న్యూస్ బాక్స్

లద్దె పురుగు నివారణకు చర్యలు

నందిగాం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటకు పొగాకు లద్దె పురుగు ఆశించిందని, దీని నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్ వర్మ సూచించారు. బుధవారం కొండపేట, పోలవరం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంటకు ఆశిస్తున్న పురుగు నివారణకు ఎకరానికి ఇమామెక్టిన్ బెంజియట్ వంద గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని, లేకుంటే నువ్రాన్ 200ఎంఎల్ పిచికారీ చేయాలని సూచించారు. అపరాల పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు హారతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

షాట్‌పుట్ విజేత నరేంద్రకు అభినందన

హిరమండలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో బుధవారం నిర్వహించిన నియోజక వర్గస్థాయి క్రీడా పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి నరేంద్ర విజేతగా నిలిచినట్లు హెచ్ఎం టి.కేశవరావు తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో నరేంద్రను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రేపటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

నరసన్నపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈనెల 19 వరకు సంక్రాంతి సెలవులను ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోతరగతి విద్యార్థులకు సెలవుల్లో అదనపు తరగతులను నిర్వహించరాదని ఎంఈవో శాంతారావు పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలన్నారు.

రేపు వాసుదేవుని ఆలయంలో ఉత్తరద్వార దర్శనం

మందస, జనవరి8 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన మందస వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు ఆలయ అర్చకులు కూర్మాచార్యులు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా వాసుదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రేపు ముక్కోటి ఏకాదశి పూజలు

టెక్కలి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నంబాళ్లపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉత్తరద్వార దర్శనం, హోమాలు, వసంతోత్సవం, తిరువీధి నిర్వ హించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

క్రీడల్లో గిరిజన యువత రాణించాలి

మెళియాపుట్టి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గిరిజన యువత రాణించాలని మాజీ ఎంపీపీ బైరిశింగి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం వెంకటాపురంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. సంక్రాంతి సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి యువతను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గిరిజన యువకులు పాల్గొన్నారు.

ఆలయ సమీపంలో దుర్గంధం

● ఇబ్బందులుపడుతున్న భక్తులు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు
● ఇదీ శ్రీముఖలింగంలోని తీరు

జలుమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖ లింగంలోని శ్రీముఖ లింగే శ్వర స్వామి ఆలయ సమీపంలో దుర్గంధం వెదజల్లుతోంది. శని, ఆదివారాలతో పాటు విశేష దినాల్లో వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తుం టారు. అయితే ఆలయం వెనుకభాగంలో చెత్తా చెదారాలతో నిండి పోవడంతో భక్తులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఆలయంలో ఉత్పత్తి అయిన చెత్తతో పాటు దుకాణ దారులు వ్యర్థాలను ఆలయం వెనుక భాగంలో వంశధార నది కరకట్టపై వేస్తుడడంతో అవి గబ్బుకంపు కొడుతున్నాయి. అయితే చెత్తను తొలగించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తను తొలగించి ఆలయ పరిసర ప్రాంతాలు ఆరోగ్యకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీముఖలింగేశ్వరాలయం వెనుక వంశధార కరకట్టపై ఉన్న చెత్త